
# కథ ది జర్నీ




బస్సులో జనం కిటకిటలాడుతున్నారు. ఏ నిమిషం ప్రక్కకు ఒరిగి పోతుందో అనేలా వుంది బస్సు. అయినా వేగంగా వెళుతూంది. లోపల ఆడా మగా, చిన్నా పెద్దా చెమటలు కక్కుకుంటూ ఇస్సూ... ఉస్సూ... ఛ... ఛ... వెధవ బస్సు అనుకుంటూ నిల్చున్నారు.

అరమరికలు చూడడానికి కూడా వీల్లేనంతగా వుంది ఆ వాతావరణం. అసలే శీతాకాలం పైగా చలి... ఒక రకంగా ఆ బస్సులో అంతమంది వుండడం వల్ల చెమట పడ్తున్నా అది వేసవి కాలంలా దుర్వాసన వేయడం లేదు. శరీరంలోని వేడి వల్ల అలాగనిపిస్తూంది.

ఒకరి నొకరు అప్రమేయంగానే హత్తుకు పోతున్నారు.

పైనున్న రాడ్డును పట్టుకోడానికి కూడా వీల్లేకుండా కొందరు ప్రక్కవారి మీద వాలి పోతున్నారు.

ఎంత వద్దనుకున్నా, ఎంత సర్దుకున్నా సుశీల మరి ఆ జనంలో నిలబడలేక పోతోంది. పైగా తన పక్కనే వున్న మరొకావిడ జరుగు జరుగు అని అదే పనిగా వెనుక నుంచి నెడుతోంది. ముందు ఎవరో కుర్రాడు నలిగిపోతున్నాడు. తను వద్దనుకున్నా అతని వీపుకు హత్తుకుపోతూంది. ఎందుకొచ్చిన గొడవరా... ఇలా నలిపేస్తున్నారు అనుకుంది సుశీల. ఆ ప్రక్కనున్న ఆవిడ మనిషి దిట్టంగా వుంది. ఆరడుగుల పొడవు... మంచి బలమైన అవయవ సంపద వున్న ఆమె తోపుడుకు ఒళ్ళు హూనమై పోతూంది.

ఇంతలో ఎవరి చెయ్యో సుశీల నడుము మీద పడి ఏదో వెతుకుతూంది. భుజాన వేలాడు తున్న తోలు సంచీని జాగ్రత్తగా తడిమి చూసు కుంది... వుంది... తన చేత్తో ఆ చేతిని తీసెయ్యబోయింది. ఓరగా ఆ చేతి కేసి చూసింది.

మరుక్షణం తనకే నవ్వొచ్చింది.

ఒక ఏడేళ్ళ కుర్రాడు పట్టు దొరక్క తనను పట్టుకుని నిలబడాలనుకుంటున్నాడు... పాపం... వాడు నలిగిపోతున్నాడు. వాడిని దగ్గరకు తీసుకుందామనుకున్నా వీల్లేని పరిస్థితి. ఆ లావు పాటి ఆవిడ మాత్రం తన మీద వాలి పోతూంది. అలా వాలినప్పుడు ఆమె శరీరం తన వీపు మీద కితకితలు పెడుతూంది. అంతే కాదు. తను ముందున్న కుర్రవాడి మీద పడి పోతూ...... అతని శరీరంతో కలిసిపోతూంది. అంతేకాదు తన కుడి వేపున్న మరో యువకుడు తోపిడికి తట్టుకోలేక తన మీద వాలిపోతున్నాడు.

శరీరంలో ఏదో వికారం మొదలైంది.

ఛీ... ఇదేనా బస్సు ప్రయాణం?

"ఆడా... మగా... తేడాల్లేకుండా ఒకరి మీద ఒకరు పడిపోతూ... ఒకరి శరీరం మరొకరి శరీరానికి తగుల్తూ అవసరం తీరేదాకా సరిపెట్టుకుని బస్సు దిగి వేసే పరిస్థితి ఏర్పడిందా... ముక్కూ మొహం తెలియని వాళ్ళ స్పర్శను తట్టుకోక తప్పదు. మరికొన్ని బస్సులు అదనంగా వేస్తే ఈ కష్టం వుండదు కదా" అనుకుంది సుశీల.

"ఎక్కడో అరబ్బు దేశాల్లో... 'ఆయిల్' గొడవొచ్చి ఇక్కడ బస్సులు తగ్గించేశారు.. ఇప్పుడు బస్సులో ఒకరి మీద ఒకరు పడి పోతూ... ఛ... ఛ...అసహ్యంగా తయారైంది ప్రయాణం..." లావుపాటి ఆమెను ఎవరో అదిమేస్తూ వుంటే తట్టుకోలేక చెప్తూందామె.

మధ్యలో రెండు స్టాపులు వచ్చినా బస్సు ఆగలేదు.

"అమ్మయ్య... రక్షించాడు... లేకపోతే... మన సంగతి అంతే..." అన్నాడొకతను.

ఇంతలో మెల్లగా దుమారం మొదలైంది.

సుశీల అటుకేసి చూసింది.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను... ఆ అమ్మాయి మీద అలా వాలిపోతున్నావే... పాపం అది పైన రాడ్ పట్టుకోలేక అవస్థ పడుతుంటే దాని మీద పడిపోతే ఎలా... ఆ అమ్మాయి ఓపికగా ఓర్చుకుంటూందని నీ ఇష్టం వచ్చినట్టు చేస్తావా... రాస్కెల్." అంటున్నాడు ఒకతను.

అతను ఎవర్నుద్దేశించి అంటున్నాడో అతను మాత్రం... ఏం పట్టించుకోలేదు. బస్సు కుదుపుకి, ముందున్న అమ్మాయిమీద మరోసారి తూలి పడ్డాడు. అతని చెయ్యి ఎవరినో పట్టుకోవాలని వెతుకుతూంది. పక్కనున్న రాడ్‌ను పట్టుకోబోయి, ఆ అమ్మాయి చేతిని పట్టుకుని... మెత్తగా వుండడంతో వదిలేశాడు. ఆ అమ్మాయి అతనికేసి కోపంగా చూసింది కానీ తిట్టలేక పోయింది.

"ఏరా... ఇందాకట్నుంచి తిడుతున్నా లెక్క చేయకుండా దాని చెయ్యి పట్టుకుంటావా..." అంటూ దవడమీద గుద్దాడు ఇందాక తిట్టినతను.

"అమ్మో..." అని అరిచాడు ఆ కుర్రవాడు. ఇంతలో... కొందరు ఇదే అదననుకుని అతన్ని చితకతన్నారు.

"వీళ్ళకిదే... పనిసార్. రద్దీగా వున్న బస్సులెక్కి ఆడవాళ్ళ మీద వాలిపోయి... వెధవ పనులు చెయ్యడం. వీళ్ళని వదిలిపెట్టకూడదు" అంటూ అతన్ని ఆ బస్సులోనే కొడుతుంటే

15-2-01

# ఒక ప్రశ్న-జవాబులు

అతను హృదయ విదారకంగా... ఏడుస్తూ... క్రింద పడిపోయిన తన చేతి కర్రను వెతుకుతున్నాడు.

**ఇంతలో లావుపాటి ఆవిడ జనంమ ప్రక్కకు నెట్టి...**

"ఆపండి... మీరంతా చాలా గొప్ప వాళ్ళలా ప్రవర్తిస్తున్నారు...

"ఇదిగో... అతన్ని కొట్టిన ఈ మొదటి పెద్ద మనిషి రోజూ... ఈ బస్సులో ఎంతో అసహ్యంగా ప్రవర్తించడం నాకు తెలుసు. పైకి మంచి మాటలు చెప్తూ 'హీరో'లా ప్రవర్తిస్తున్నాడు" అంటూ క్రింద పడిన చేతి కర్రను... అతనికి అందించింది. చెయ్యి పట్టుకుని.

తన మీదికి వాలిపోయిన ఆ లావుపాటి ఆవిడను అసహ్యించుకున్న సుశీల... అంత క్రితం ఆ గుడ్డి అబ్బాయి పక్కనే వున్న అమ్మాయిని తడిమినప్పుడు అతన్ని కూడా అలహ్యించుకుంది.

అంతేకాదు... అతను అంతలా తన శరీరాన్ని నలిపేస్తున్నా ఆ అమ్మాయి ఎందుకు నాలుగు తిట్లు మొహం వాచేలా పెట్ట లేదు...? అనుకుంది.

ఇంతలో... ఇందాక ఆ గుడ్డి వాడిని కొట్టిన వాళ్ళే.

"అరెరె... పాపం... ఇతను గుడ్డివాడా? పొరబాటై పోయింది..." అంటూ... "అయినా ఈ ఆడదానికి బుద్ధి వుండొద్దూ... పరాయి మగవాడు పైన పడితే అతనికి చెప్పాలి అని..." అన్నారు...

"ఏం చెప్తుందయ్యా... అదసలే పాపం మూగది. పోనీ ముందుకైనా ప్రక్కకైనా జరుగుదామంటే బస్సు క్రిక్కిరిసి పోయింది. తన బాధ ఆ పిల్ల చెప్పలేక పోయింది." అంది లావుపాటి ఆవిడ.

సుశీల మాత్రం... తన ముందు నిల్చున్న కుర్రాడిని కొరకొర చూసింది.

కళ్ళూ... నోరు... బాగున్న వాళ్ళు మాత్రం... రద్దీలో రద్దీగా... సంస్కార రహితంగా ప్రవర్తిస్తున్నారు...

పాపం... మరో గత్యంతరం లేక... బ్రతుకు తెరువు కోసం బస్సెక్కిన ఆ గుడ్డి వాడు... మూగమ్మాయి మాత్రం... జనం నోళ్ళలో నలిగిపోయారు... బస్సు స్టాపులో ఆగింది.

కళ్ళమ్మట నీళ్ళతో... చేతిలోని స్టిక్... తో క్రిందికి దిగుతున్న ఆ గుడ్డి వాడిని మూగమ్మాయి చెయ్యిపట్టుకు దింపింది. ●



—ఏ.వి.కనకదుర్గ,
మద్రాసు

1-2-91 సంచికలో ప్రచురించిన ప్రశ్న!

● ఆడవారి మాటలకు అర్థాలే వేరులే! మరి మగవారి మాటలకు?

— మద్రాసు నుంచి ఈ ప్రశ్న పంపిన పాఠకురాలు ఏ.వి.కనకదుర్గ పంపిన సమాధానం:

■ వినేవారి చెవిలో 'అన్నీ పువ్వులే'

■ అర్థాలే లేవులే

■ అన్నీ విపరీతార్థాలే!

— కె.సరోజినీదేవి, రేపల్లె-522 265

■ అసలు అర్థమే లేదులే!

— ఎన్నెస్ కుమారి, తణుకు-534 211

■ భాషే లేదులే!

— సి.ప్రకాష్‌బాబు, సూళ్లూరుపేట

■ అ(న్య)ర్థాలే

— ఎమ్వీ రమేష్, పెనుగొండ

■ చెప్పు దెబ్బలు తప్పవులే

— టి.జె.సునీల్, సూళ్లూరుపేట

■ మర్మాలే వేరులే


— ఈతకోట కొండలరావు, శ్రీహరికోట

■ అనుమానాలు జోరులే

— ఎస్.సూర్యప్రకాశరావు, రామరాజులంక

■ అసలు అర్థాలే లేవులే

— మరో చార్లెస్, విజయవాడ-520 002



పి.రాజానిర్మల్
C/o పి.దేవిజాకోబ్
చీరాల-523 157

ఈ వారం ప్రశ్న

● "ఓ అబ్బాయి ఓ అమ్మాయిని చూసి కన్నుగీటితే ఆ అమ్మాయి ఏమనుకుం టుంది.

● ఈ ప్రశ్నకు సమాధానాలు 9-2-91 తేదీలోగా పంపగోర్తాము.

—ఎడిటర్